సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం । 27 । ఫిబ్రవరి । 2024



నేడు అష్టదళ పద్మారాధన

విశాఖలోని కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. 8లో



తాండవలో సినిమా షూటింగ్

తాండవ జలాశయం వద్ద సోమవారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. పలు సన్నివేశాలు చిత్రీకరించారు.



పూడిమడకలో జాతర సందడి

పూడిమడక తీరంలో మాఘపౌర్ణమి జాతర సందడి కొనసాగుతోంది. వారం రోజుల వరకూ దుకాణాల సందడి ఉంటుంది.

న్యూస్‌రీల్

15 క్వింటాళ్ల మిర్చి దగ్ధం



కాలిపోయిన మిరప కాయలను చూపిస్తూ రోదిస్తున్న బాధిత రైతు కుటుంబం

చింతూరు: మండలంలోని దొంగల జగ్గారంలో సోమవారం రైతు గుగులోతు బాలయ్యకు చెందిన 15 క్వింటాళ్ల మిరపకాయలు ప్రమాదవశాత్తు కాలిపోయాయి. కల్లంలో మిరపకాయలను ఆరబెట్టి ఇంటికి వెళ్లిన సమయంలో ఆకస్మాత్తుగా మంటలు వ్యాపించాయని దీంతో మిరప కాయలు కాలిపోయినట్టు బాధిత రైతు కుటుంబం కన్నీరుమున్నీరైంది. ఈ ఘటనలో సుమారు రూ.3 లక్షల వరకు ఆస్తినష్టం సంభవించిందని బాధిత రైతు తెలిపాడు. ఏడుగురాళ్లపల్లి గ్రామ సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్ సరిత సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు.

పీఎం విశ్వకర్మ పథకంపై అవగాహన సదస్సు రేపు

పాడేరు: ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంపై ఈనెల 28న ఉదయం 10 గంటలకు పాడేరు ఐటీడీఏ సమావేశ మందిరంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డీవీఎస్ఆర్ మూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్ఎంఈ, డెవలప్‌మెంట్ ఫెసిలిటేషన్, జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన సంబంధిత కుల వృత్తుల వారి వివరాలను రిజిస్ట్రేషన్ చేస్తామన్నారు. జిల్లాలోని సంబంధిత కులవృత్తిదారులు హాజరై విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. పూర్తి వివరాలకు తనను 9492689462 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

ఇంటర్ పరీక్షలకు విస్తృత ఏర్పాట్లు

జిల్లా ప్రత్యేకాధికారి వినోద్‌బాబు

రాజవొమ్మంగి: ఇంటర్ పరీక్షలకు విస్తృతమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్టు ఇంటర్‌బోర్డు జిల్లా ప్రత్యేకాధికారి వినోద్‌బాబు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పరీక్షా కేంద్రం ప్రధాన ద్వారంతో పాటు చీఫ్ సూపరింటెండెంట్ గది, విద్యార్థులు పరీక్ష రాసే హాలులో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ఇంటర్‌బోర్డు కార్యాలయం నుంచి ప్రత్యేక్షంగా పర్యవేక్షించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. జిల్లాలో మొత్తం 13,245 మంది విద్యార్థులు ఇంటర్ ఫస్ట్, సెకండియర్ పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. పాడేరు డివిజన్‌లో 17, రంపచోడవరం, చింతూరు డివిజన్లలో 10 చొప్పున 27 పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేశామన్నారు. మొత్తం 297 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్టు చెప్పారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, విద్యార్థులు 10 నిమిషాల ముందు హాజరు కావాలని సూచించారు.

ఉమానీలకంఠేశ్వరస్వామి వారిని తాకిన సూర్యకిరణాలు



శివలింగం, ఉమానీలకంఠేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను తాకిన సూర్యకిరణాలు

సాక్షి, పాడేరు: పట్టణంలోని పాతబస్టాండ్ ప్రాంతంలో ఉమానీలకంఠేశ్వరస్వామిని సోమ వా రం ఉదయం సూర్యకిరణాలు తాకాయి. శివలింగంతో పాటు ఉమానీలకంఠేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలపై సూర్యకిరణాల వెలుగును చూసిన భక్తులంతా పరవశించారు. ప్రత్యేక పూజలు చేశారు.

నేటి నుంచి టెట్ పరీక్ష

విశాఖ విద్య: టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్-2024) పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఈవో ఎల్.చంద్రకళ తెలిపారు. జిల్లాలో 9 కేంద్రాల్లో జరగనున్న ఈ పరీక్షలకు 37,556 మంది అభ్యర్థులు హాజరవుతున్నట్లు వెల్లడించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డు ఒరిజినల్, జెరాక్స్ ప్రతి, ఏదైనా గుర్తింపు కార్డు వెంట తీసుకొని రావాలన్నారు. ప్రతీ రోజు మొదటి సెషన్ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందన్నారు. పరీక్ష సమయానికి గంట ముందు అభ్యర్థులు కేంద్రాలకు చేరుకోవాలన్నారు.

సీతాకోకచిలుకా.. నీవే వాలాలనీ..



అటవీ పర్యాటకంగా అభివృద్ధి చెందుతున్న జిల్లాలో మరో కొత్త ప్రాజెక్టు అందుబాటులోకి రానుంది. సింహాద్రి ఎన్టీపీసీ సహకారంతో మర్దగుడ వద్ద అటవీశాఖ చేపట్టిన బటర్ ఫ్లై పార్కు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మూడు నెలల్లో సందర్శకులకు అందుబాటులోకి తెస్తామని అధికారులు వెల్లడించారు

- మర్దగుడ వద్ద సిద్ధమవుతున్న బటర్‌ఫ్లై పార్కు
- సందర్శకులకు కొత్త అనుభూతి మిగిల్చేలా ప్రాజెక్టు
- రూ.5.5 కోట్లు కేటాయించిన సింహాద్రి ఎన్టీపీసీ
- పనులు వేగవంతం చేసిన అటవీశాఖ



ముఖద్వారం వద్ద ఏర్పాటు చేసిన ప్రాజెక్టు వివరాల బోర్డు



పార్కులోకి నిర్మిస్తున్న గ్రావెల్ రోడ్డు

అనంతగిరి: సరికొత్త ప్రాజెక్టులతో అటవీశాఖ పర్యాటకులకు మరింత దగ్గరవుతోంది. మన్యంలోని ఉండే ఆహ్లాదకరమైన వాతావరణంలో నూతన ఉత్తేజం కలిగించేలా ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. ఓవైపు పర్యాటకులు మరపురాని అనుభూతి మిగిల్చేలా.. మరోపక్క స్థానికులకు ఉపాధి కల్పించి, ఆదాయం మెరుగుపడేలా కార్యాచరణతో ముందుకు సాగుతోంది.

- మండలంలోని అరకు-విశాఖ ప్రధాన రోడ్డును ఆనుకొని మర్దగుడ సమీపంలోని చాపరాయి వద్ద సింహాద్రి ఎన్టీపీసీ సహకారంతో అటవీశాఖ 5.5 కోట్లతో చేపట్టిన సీతాకోకచిలుక ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. యుద్ధప్రాతిపదికన పార్కును అందుబాటులోకి తెచ్చే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. మరో మూడు నెలల్లో అందుబాటులోకి వచ్చేలా ప్రణాళికపరంగా చర్యలు తీసుకుంటున్నామని ఆశాఖ అధికారవర్గాలు తెలిపాయి.

ప్రత్యేకత ఇలా..

- దట్టమైన అటవీ ప్రాంతంలో సుమారు 10 హెక్టార్లలో నిర్మిస్తున్న ఈ పార్కులో ఓపెన్ బటర్‌ఫ్లై గార్డెన్, ఔషధ మొక్కల వనం, వాచ్ టవర్ ఏర్పాటుచేస్తున్నారు. ఇక్కడ సందర్శనకు వచ్చే వారికి సేంద్రియ విధానంలో పండించిన అటవీ ఉత్పత్తులను అందుబాటులో స్టాల్ ఏర్పాటుచేస్తున్నారు.
- ఈ ప్రాజెక్టు ద్వారా సందర్శకుల నుంచి వచ్చే ఆదాయాన్ని వన సంరక్షణ సమితి సభ్యులకు, కొంతమంది నిరుద్యోగ యువతకు వెచ్చించనున్నారు. మర్దగుడ గ్రామాభివృద్ధికి కేటాయించడమే కాకుండా వన్యప్రాణులకు వినియోగిస్తామని అటవీశాఖ పేర్కొంది.
- అటవీప్రాంతంలో సహజసిద్ధం అందాలకు నిలయంగా నీరు నిల్వ ఉండేలా ఏడు రాక్‌ఫిల్ డ్యామ్‌లు నిర్మించారు.
- పర్యాటకులు మంచి అనుభూతిని మిగిల్చేలా భారీ వృక్షాలపై ట్రీహట్స్ నిర్మిస్తున్నారు.



ప్రాజెక్టు వద్ద ఏర్పాటుచేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



పార్కు ప్రదేశంలో నిర్మిస్తున్న కాఫీహౌస్

- ప్రాజెక్టు వద్ద రూ.10 లక్షలతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. గ్రావిటీ ద్వారా పైపులైన్ వేసి తాగునీటి సదుపాయం కల్పించారు. ప్రాజెక్టు ముఖద్వారం నుంచి పార్కు వరకు గ్రావెల్ రోడ్డు పనులు చేపట్టారు.
- అరకు-విశాఖ ప్రధాన రహదారి ఆనుకుని కాఫీ తోటలో కాఫీ హౌస్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పిల్లర్ల పనులు పూర్తయ్యాయి. గ్రావిటీ పథకం ద్వారా వచ్చే నీటిని ప్రాజెక్ట్ మొత్తానికి సరఫరా చేసేందుకు వాటర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణం దాదాపుగా పూర్తయింది.

ఆకట్టుకునేలా నిర్మిస్తున్నాం

పర్యాటకులను ఆకట్టుకునేలా సీతాకోకచిలుక ప్రాజెక్టు పనులు చేపడుతున్నాం. సందర్శకులకు అన్ని వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. దట్టమైన అటవీ ప్రాంతంలో భారీ వృక్షాల మధ్య ప్రాజెక్టు నిర్మాణం జరుగుతోంది. పర్యాటకులకు మరుపురాని అనుభూతి మిగులుస్తుందని ఆశిస్తున్నాం.

– వినోద్‌కుమార్, డీఎఫ్‌వో, పాడేరు

ప్రత్యర్థులను గంజాయి కేసులో ఇరికించేందుకు కుట్ర

- ఛేదించిన పోలీసులు
- ముగ్గురు జెన్‌కో ఉద్యోగులు, మరో వ్యక్తి అరెస్టు



గంజాయి కేసులో నిందితులతో సీఐ గజేంద్ర, ఎస్‌ఐ గోపాలరావు

మోతుగూడెం: ప్రత్యర్థి యూనియన్ సభ్యులను గంజాయి కేసులో ఇరికించేందుకు మరో యూనియన్ సభ్యుడు పన్నిన కుట్రను స్థానిక పోలీసులు ఛేదించారు. ఏపీ జెన్‌కోకు చెందిన కార్మిక సంఘాలైన ఐఎన్‌టీయూసీ 327, ఏపీఈఈయూ 1104 మధ్య పదవుల విషయంలో తీవ్రమైన పోటీ ఉంది. ఈ నేపథ్యంలో ఐఎన్‌టీయూసీ 327 కార్యాలయంలో గంజాయి ఉన్నట్టు పోలీసులకు ప్రత్యర్థి యూనియన్ ఏపీఈఈయూ 1104కు చెందిన సూరినీడు నాయుడు సమాచారం అందించాడు. ఈ మేరకు సోమవారం యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన తనిఖీల్లో ఐదు కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. యూనియన్ కార్యాలయంలో గంజాయి లభ్యం కావడం వెనుక కుట్ర ఉండవచ్చని అనుమానించిన సీఐ గజేంద్ర, ఎస్‌ఐ గోపాలరావు ఆ కోణంలో దర్యాప్తు వేగవంతం చేశారు. ప్రత్యర్థి యూనియన్ సభ్యులను ఇరికించేందుకు పొల్లూరుకు చెందిన రవి అనే వ్యక్తి వద్ద రూ.4 వేలకు కొనుగోలు చేసి సూరినీడు నాయుడు తీసుకువచ్చినట్టుగా విచారణలో గుర్తించారు. అతనికి జెన్‌కో ఉద్యోగులు బండారు రాజేష్, కె.రామకృష్ణ సహకరించినట్టు నిర్ధారణ కావడంతో మొత్తం నలుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ, ఎస్‌ఐలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జెన్‌కో ఉద్యోగులు వ్యక్తిగత కక్షలకు వెళ్లొద్దని.. ఏమైనా సమస్యలు ఉంటే చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని వారు సూచించారు. ఇలాంటి కుట్రపూరిత నేరాలకు పాల్పడితే చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.

సంక్షేమ పాలనలో సచివాలయ వ్యవస్థ కీలకం

ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర



గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

ముంచంగిపుట్టు: ప్రభుత్వం అందించే సంక్షేమపాలనలో గ్రామ సచివాలయ వ్యవస్థ కీలకపాత్ర పోషిస్తోందని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. మండలంలోని సుజనకోట పంచాయతీ కేంద్రంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు 43.60 లక్షలతో నిర్మించి గ్రామ సచివాలయ భవనాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. దీనిలో భాగంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం సచివాలయాల ద్వారా దేశానికే ఆదర్శమైన పాలనను అందిస్తోందన్నారు. గతంలో ప్రభుత్వ పథకాలు పొందేందుకు ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారని, గ్రామ సచివాలయ వ్యవస్థ వల్ల ప్రజల చెంతకే సేవలు అందుతున్నాయన్నారు. ఎంపీపీ సీతమ్మ, వైస్‌ఎంపీపీ భాగ్యవతి, సర్పంచ్ రమేష్, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి, ,ఎంపీడీవో కిరణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు పాల్గొన్నారు.

వైద్య కళాశాలలో ఉద్యోగాలకు తాత్కాలిక మెరిట్ జాబితా

ప్రిన్సిపాల్ హేమలతాదేవి

సాక్షి,పాడేరు: స్థానిక వైద్య కళాశాలలో పొరుగు సేవల విధానంలో భర్తీ చేయనున్న 19 కేటగిరిల్లోని పోస్టులకు సంబంధించి అభ్యర్థుల తాత్కాలిక జాబితాను విడుదల చేసినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.హేమలతాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.34 కేటగిరీల్లో 256 పారామెడికల్, మినీస్టిరియల్ ఉద్యోగాలకు దరఖాస్తులు స్వీకరించామన్నారు. పలు కేటగిరీల ఉద్యోగాలకు సంబంధించి ఇప్పటికే రెండు విడతలుగా అభ్యర్థుల తాత్కాలిక మెరిట్ జాబితాలను విడుదల చేసి అభ్యంతరాలను స్వీకరించామన్నారు. అయితే పెండింగ్‌లో ఉన్న మరో 19 కేటగిరీలకు సంబంధించి అభ్యర్థుల తాత్కాలిక జాబితాను విడుదల చేశామని ఆమె పేర్కొన్నారు. ఈనెల 29వతేదీ సాయంత్రం 5గంటల వరకు అభ్యర్థుల నుంచి అభ్యంతరాలను స్వీకరిస్తామన్నారు. తాత్కాలిక మెరిట్ జాబితాను asrnic వెబ్‌సైట్‌లో పొందుపరిచామని ఆమె తెలిపారు. అభ్యర్థులు పరిశీలించి ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా మెయిల్ ద్వారా గాని, నేరుగా గాని తెలియజేయవచ్చని ఆమె సూచించారు. recruitment gmcpaderu@gmail.comకు అభ్యంతరాలను మెయిల్ ద్వారా పంపించవచ్చని ఆమె తెలిపారు.

గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేకదృష్టి

పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు: ఏజెన్సీ 11 మండలాల పరిధిలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, గిరిజన గురుకులాల్లో గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించామని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వసతి గృహాల్లో విద్యార్థులకు జ్వరం, ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే నిర్వాహకులు నిర్లక్ష్యం చేయకుండా సమీపంలో ఉన్న ఆస్పత్రులకు తీసుకువెళ్లి సత్వర వైద్యం అందేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఆస్పత్రిలో వైద్యుల సూచన మేరకు పాడేరు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలిస్తున్నారని అక్కడ కూడా పూర్తి స్థాయిలో నయం కాకపోతే విశాఖ కేజీహెచ్‌కు తరలించి మెరుగైన వైద్యం అందిస్తున్నారని పేర్కొన్నారు. మెరుగైన వైద్యసేవలు అందించేందుకు విశాఖపట్నం కేజీహెచ్‌లో ట్రైబల్ సెల్ వైద్యులు, సిబ్బంది విశేష కృషి చేస్తున్నారన్నారు. విద్యార్థులకు అవసరమైన మందులు కొరత లేకుండా చూస్తున్నామని తెలిపారు. రక్తం అవసరమైన విద్యార్థులకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా సరఫరా జరుగుతోందన్నారు. ఇప్పటికే అన్ని మండలాల ఏటీడబ్ల్యూవోలు, హెచ్‌ఎంలు, డిప్యూటీ వార్డెన్లతో సమావేశం నిర్వహించి విద్యార్థులకు అందించాల్సిన మెనూ, ఆరోగ్యంపై ప్రత్యేక ఆదేశాలు జారీ చేసినట్టు పీవో పేర్కొన్నారు. జువైనల్ జస్టిస్ ఆదేశాల మేరకు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల లోపల బయట వ్యక్తుల ప్రవేశం లేదన్నారు. ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలను నిత్యం తనిఖీ చేసి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంతోపాటు వారి ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని అన్ని మండలాల గిరిజన సంక్షేమ సహాయ అధికారులను ఆదేశించినట్టు ఆయన పేర్కొన్నారు.

క్షణికావేశానికి నిండు ప్రాణం బలి

- మద్యం మత్తులో భార్యపై దాడి
- తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి
- ప్రమాదమని నమ్మించేందుకు యత్నం
- కుట్రను ఛేదించిన పోలీసులు
- భర్తను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలింపు



లక్ష్మి మృతదేహం



నిందితుడు భూమిరెడ్డి

మారేడుమిల్లి: భోజనం వండలేదన్న కోపంతో మద్యం మత్తులో ఓ వ్యక్తి భార్యపై దాడికి పాల్పడ్డాడు. తీవ్రంగా గాయపడిన ఆమె చికిత్స పొందుతూ మృతిచెందింది. మూర్ఛ వల్ల కిందపడిపోవడంతో తీవ్రంగా గాయపడి చనిపోయిందని నమ్మించేందుకు ప్రయత్నించిన ఆ వ్యక్తి కుట్రను స్థానిక పోలీసులు ఛేదించారు. భార్య మరణానికి కారణమైన అతనిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ రుద్రరాజు భీమరాజు తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని తాడేపల్లి గ్రామానికి చెందిన కత్తుల భూమిరెడ్డి ఈ నెల 22వ తేదీన పూటుగా జీలుగుకల్లు సేవించి ఇంటికి వచ్చాడు. భార్య కత్తుల లక్ష్మిని భోజనం పెట్టమని అడిగాడు. వండలేదని ఆమె సమాధానం చెప్పడంతో మద్యం మత్తులో ఆగ్రహానికి గురైన భూమిరెడ్డి పక్కనే ఉన్న చెక్క పీటతో ఆమె తలపై కొట్టడంతో తీవ్రంగా గాయపడి అక్కడిక్కడే కుప్పకూలిపోయింది. అనంతరం ఆమెను మరుసటి రోజు రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించాడు. ఫిట్స్ వల్ల పడిపోవడంతో తలకు గాయమైందని చెప్పి ఆస్పత్రిలో చేర్పించాడు.

ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యసేవల నిమిత్తం కాకినాడ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదే రోజు ఆమె మృతి చెందింది. దీనిపై ఆస్పత్రి సిబ్బంది మారేడుమిల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ రుద్రరాజు భీమరాజు, ఎస్‌ఐ రాము అక్కడికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. దాడి చేయడం వల్లే ఏర్పడిన గాయం కావొచ్చని అనుమానించిన వారు ఆస్పత్రి వైద్యులను సంప్రదించారు. వివరాలు సేకరించిన అనంతరం దర్యాప్తు వేగవంతం చేశారు. దాడి చేయడం వల్లే తీవ్రంగా గాయపడి చనిపోయిందని భూమిరెడ్డి అంగీకరించడంతో అతనిపై ఐపీసీ 302, 201 సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేశారు. నిందితుడిని సోమవారం రంపచోడవరం న్యాయస్థానంలో హాజరు పరచగా రిమాండ్ విధించినట్టు సీఐ రుద్రరాజు భీమరాజు తెలిపారు. సకాలంలో స్పందించి చాకచక్యంగా కేసును ఛేదించిన సీఐ రుద్రరాజు భీమరాజు, ఎస్‌ఐ రాము, రైటర్లు నాగార్జున, మారుతి, కానిస్టేబుల్ ఆదినారాయణలను రంపచోడవరం ఏఎస్పీ జగదీశ్ అడహళ్లి అభినందించారు.

బాల్య వివాహాల నియంత్రణకు పటిష్ట చర్యలు

- బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు
- ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు



మాట్లాడుతున్న కమిషన్ ఛైర్మన్ అప్పారావు, పక్కన ఐటీడీఏ పీవో, ఏఎస్పీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



హాజరైన పలు శాఖల అధికారులు, విద్యార్థినులు

సాక్షి,పాడేరు: బాల్య వివాహాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపడుతున్నామని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు తెలిపారు. స్థానిక కాఫీ అతిథి గృహంలో ఐసీడీఎస్ ఏర్పాటు చేసిన బాల్య వివాహల నివారణ సదస్సును ఐటీడీఏ పీవో వి.అభిషేక్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో బాల్య వివాహల నివారణ లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బాలికల విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. యుక్త వయసులో బాలికలు మరింత అప్రమత్తంగా ఉండాలని, సామాజిక మాధ్యమాలు,సెల్ ఫోన్లకు దూరంగా ఉండి చదువులపై దృష్టిసారించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ఇక్కడ చదివిన విద్యార్థులు ఐఏఎస్,ఐపీఎస్,గ్రూప్-1 ఉద్యోగాలు సాధిస్తున్నారన్నారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ బాలికల హక్కులను కాపాడాల్సిన సామాజిక బాధ్యత అందరిపై ఉందన్నారు. బాలికల సంక్షేమం లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అంగన్వాడీ కేంద్రాలతో పాటు ప్రభుత్వ పాఠశాల ల్లోను నాణ్యమైన పౌష్టికాహారం అందుతుందని,సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గిరిజన ప్రాంతాలలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్‌ను అమలుజేసి ఎంతో స్త్రీ,శిశు సంక్షేమానికి కృషి చేస్తున్నారని ఆమె తెలిపారు. ఐటీడీఏ పీవో అభిషేక్, పాడేరు ఏఎస్పీ ధీరజ్ మాట్లాడుతూ గిరిజన బాలికలు ఉన్నత విద్య, ఉద్యోగ లక్ష్యాలను పెంపొందించుకోవాలన్నారు. మహిళా పోలీసు వ్యవస్థ ఏర్పడిన నాటి నుంచి గ్రామాల్లో బాలికలు,మహిళలకు రక్షణ పెరిగిందన్నారు. బాల్య వివాహాలు కూడా తగ్గాయన్నారు. బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు,ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, డీఈవో బ్రహ్మాజీరావు, ఐసీడీఎస్ సీడీపీవోలు పాల్గొన్నారు. ఇలావుండగా ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పాడేరులోని మోదకొండమ్మతల్లిని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ అప్పారావు,సభ్యుడు సీతారామ్‌లు దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు.ఆలయ కమిటీ ప్రతినిధులు వీరిని దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. అమ్మవారి చిత్రపటం, ,ప్రసాదాలను పంపిణీ చేశారు.

ఆర్థిక అక్షరాస్యతపై చైతన్య పరచాలి

జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ



ఆర్థిక అక్షరాస్యతపై పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేసీ భావన వశిష్ఠ, అధికారులు

సాక్షి,పాడేరు: ఆర్థిక అక్షరాస్యతపై ప్రజలను చైతన్యపరచాలని జేసీ భావన వశిష్ఠ ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాలపై అవగాహన తీసుకురావాలన్నారు. బ్యాంకింగ్ కార్యకలాపాలపై పాఠశాలల్లో సదస్సులు నిర్వహించాలని సూచించారు. లీడ్ బ్యాంకు మేనేజర్ ఎస్.రవితేజ మాట్లాడుతూ ఈనెల 27వతేదీన హుకుంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామన్నారు.బ్యాంకింగ్ కార్యక్రమాలపై వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ టి.కిషోర్‌కుమార్, యూబీఐ మేనేజర్ భానుశేఖర్ పాల్గొన్నారు.

అరకు రైల్వేస్టేషన్ అభివృద్ధి హర్షణీయం



శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన జేసీ భావన వశిష్ఠ



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న జేసీ

అరకులోయటౌన్: నిత్యం పర్యాటకులతో రద్దీగా ఉండే అరకు రైల్వేస్టేషన్ అమృత్ భారత్ పథకంలో అభివృద్ధి చేయడం సంతోషించదగ్గ విషయమని జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ తెలిపారు. రూ.16.54కోట్లతో చేపట్టనున్న అరకు రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులకు సోమవారం వర్చువల్ విధానంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక రైల్వేస్టేషన్‌లో జేసీ వీక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సెయింట్ జోషఫ్, గురుకులం బాలుర, బాలికల పాఠశాలల విద్యార్థులకు ఆమె బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే సీనియర్ డీఈఈ పాండిటోమ్, డీఎఫ్ఎం సన్‌ట్లెస్సీ, అరకు ఏడీఎన్ దిలీప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వీఎఫ్‌సీసీ అధ్యక్షుడిగా కాయల వెంకటరెడ్డి

విశాఖ సిటీ: వైజాగ్ ఫిలింనగర్ కల్చరల్ సెంటర్ అధ్యక్షుడిగా ఏపీ మారిటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే కార్యదర్శిగా సిహెచ్.శ్రీనివాసరాజు, ఉపాధ్యక్షుడిగా ఆర్.వి.చంద్రమౌళిప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా ఎం.ఎస్.ఎన్.రాజు, కోశాధికారిగా ఎస్.ఆర్.గోపీనాథ్ నియమితులయ్యారు. ప్రముఖ స్టార్ మేకర్ ఎల్.సత్యానందం సభ్యులలో ఒకరిగా ఎన్నుకున్నారు. ఈ కొత్త ఆఫీస్ బేరర్లు రెండేళ్ల పాటు కొనసాగనున్నారు.



కాయలవెంకటరెడ్డిని సన్మానిస్తున్న కార్యవర్గం

ఈ సందర్భంగా అధ్యక్షుడు కాయల వెంకటరెడ్డి మాట్లాడుతూ విశాఖను ఫిల్మ్ మేకింగ్, స్టూడియోలకు హబ్‌గా మార్చేందుకు వీఎఫ్‌సీసీలో తమ నూతన బృందం కృషి చేస్తుందని తెలిపారు.

క్లుప్తంగా

శివరాత్రి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ ధర్మకర్త సింహాచలంనాయుడు తదితరులు

సాక్షి, పాడేరు: స్థానిక ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో మార్చి 6,7,8తేదీల్లో శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు చెప్పారు. ఉత్సవాలకు సంబంధించిన ప్రచార పోస్టర్‌లను కమిటీ ప్రతినిధులు, భక్తులు సోమవారం ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఉత్సవాల్లో భాగంగా 6వ తేదీన ఉమానీలకంఠేశ్వర స్వామి కల్యాణోత్సవం, 7న ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, 8న అన్నసమారాధన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

గంజాయి నిందితుల అరెస్టు



నిందితులతో సీఐ రుద్రశేఖర్, ఎస్ఐ సంతోష్

డుంబ్రిగుడ: మండలంలోని జైపూర్ జంక్షన్ వద్ద సోమవారం తనిఖీలు చేస్తుండగా ఓ కారులో తరలిస్తున్న గంజాయిని పట్టుకున్నట్టు డుంబ్రిగుడ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. అరకు సీఐ రుద్రశేఖర్ మాట్లాడుతూ ఒడిశా నుంచి కారులో తరలిస్తున్న గంజాయిని జైపూర్ జంక్షన్ వద్ద స్వాధీనం చేసుకున్నామని, వాహనంలో ఉన్న నలుగురిని అదుపులో తీసుకున్నట్టు చెప్పారు. వాహనాన్ని సీజ్ చేసి నిందితులను అరెస్టు చేసినట్టు సీఐ రుద్రశేఖర్ తెలిపారు.

గుండెపోటుతో న్యాయవాది మృతి




ప్రేమచంద్ కుమార్ (ఫైల్)

అరకులోయటౌన్: పాతపోస్టాఫీసు కాలనీలోని ఉంటున్న న్యాయవాది బుర్జ ప్రేమ్‌చంద్‌కుమార్ (30) గుండెపోటుతో సోమవారం మృతి చెందాడు. తండ్రి బుర్జ సింహాచలం న్యాయవాదిగా చేస్తున్నారు. మార్నింగ్ వాకింగ్‌కు వెళ్తూ హఠాత్తుగా గుండెపోటుతో కుప్పకూలినట్టు పలువురు తెలిపారు. యువ న్యాయవాది ప్రేమ్‌చంద్‌కుమార్ హఠాన్మరణంతో కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రేమ్‌చంద్‌కుమార్ మృతదేహానికి అరకు నియోజకవర్గ సమన్వయకర్త రేగం మత్స్యలింగం తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఛ్ఛే.. ఏం చేద్దాం!

- అధినేతను కలిసినా లభించని హామీ
- ఆశ వదులుకోవాల్సిందేనని బాబ్జీకి సిగ్నల్
- చీపురుపల్లికి చలో అనాల్సిందేనని గంటాకు స్పష్టీకరణ
- భీమిలి నుంచి సీటు కావాలని గంటా వేడుకోలు
- అనకాపల్లి విషయంలోనూ పీలాకు అదే తీరే..
- బాబు తీరుపై మండిపడుతున్న నేతలు



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

అధినేతతో సమావేశం తర్వాత హామీ లభిస్తుందనుకున్న టీడీపీ నేతలకు భంగపాటు ఎదురైంది. విశాఖ దక్షిణం, అనకాపల్లి, భీమిలి సీట్ల విషయంలో అధినేతను కలిసిన ముగ్గురు నేతలకు ఎటువంటి హామీ లభించలేదు. విశాఖ దక్షిణం సీటును ఆశించి క్షేత్రస్థాయిలో పనిచేసుకుంటున్న గండి బాబ్జీ సీటుకు గండిపడినట్టేనని తేలిపోయింది. ఇక అనకాపల్లి సీటు విషయంలో పీలా గోవింద్ ఆశలు వదులుకోవల్సిందేనని స్పష్టమైంది. గంటా శ్రీనివాసరావు చలో చీపురుపల్లి అనాల్సిందేనని చంద్రబాబు తేల్చిచెప్పినట్టు తెలుస్తోంది. అధినేతను కలిసిన తర్వాత హామీ వస్తుందనుకున్న నేతలకు ఊరడింపు మాటలు మినహా సీటు ఊసెత్తకపోవడంతో ఊసురోమనుకుంటూ తిరుగుపయనమైనట్టు తెలుస్తోంది. తెలుగుదేశం-జనసేన సీట్ల ప్రకటనల అనంతరం అసమ్మతి నేతలకు స్పష్టమైన హామీ లభించకపోవడంతో తమ రాజకీయ భవిష్యత్‌పై ఎవరికివారుగా తమ అనుచరులతో భేటీ అయ్యేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం.

దక్షిణ ఆశలకు గండి

గత ఎన్నికల్లో విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యేగా టీడీపీ తరుపున గెలిచిన వాసుపల్లి గణేష్‌కుమార్ ఆ పార్టీ తీరు నచ్చకపోవడంతో దూరంగా ఉన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిపాలన తీరును మెచ్చుకుంటూ ప్రభుత్వానికి మద్దతుగా ఉంటున్నారు. వాసుపల్లి దూరమైన తర్వాత నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఎవరిని నియమించాలో తెలియని పరిస్థితి తెలుగుదేశం పార్టీలో నెలకొంది. కొన్నాళ్లకు గండి బాబ్జీని నియోజకవర్గ ఇన్‌చార్జిగా తీసుకువచ్చారు. అప్పటి నుంచి నియోజకవర్గంలో గండి బాబ్జీ పర్యటిస్తూ వచ్చారు. ఇందుకోసం బాగానే ఖర్చు చేసినట్టు తెలుస్తోంది. ఈ ఎన్నికల్లో దక్షిణం నుంచి సీటు వస్తుందని మొన్నటివరకూ ఆశించారు. అయితే, పొత్తులో భాగంగా భీమిలితో పాటు విశాఖ దక్షిణ సీటును జనసేనకు ఇస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. దీంతో అప్రమత్తమైన గండి బాబ్జీ ముందుగానే పార్టీ పెద్దలను కలసి సీటు కోసం ప్రయత్నించారు. ఆదివారం విజయవాడలో చంద్రబాబును కలిసి సీటు కోసం ప్రయత్నించారు. అయితే, దక్షిణం సీటుపై ఆశలు వదిలేసుకోవాలని స్పష్టంగా పేర్కొన్నట్టు తెలుస్తోంది. ఒకవేళ అవకాశం ఉంటే మాడుగుల నియోజకవర్గానికి పంపే అవకాశాన్ని పరిశీలిస్తానని మాత్రమే చెప్పినట్టు సమాచారం. అయితే, మాడుగుల నియోజకవర్గానికి వెళ్లనని ఆయన చంద్రబాబుకు చెప్పినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో భవిష్యత్ కార్యాచరణపై తన అనుచరులతో గుమ్మనంగా బాబ్జీ సంప్రదింపులు జరుపుతున్నట్టు సమాచారం.

చీపురుపల్లికి వెళ్లాల్సిందే..!

ఎన్నికలు జరిగిన ప్రతీసారి నియోజకవర్గాన్ని మార్చే అలవాటున్న గంటాకు... అదే తీరుతో గట్టి షాక్ ఇవ్వాలని చంద్రబాబు నిర్ణయించారు. ఇందుకోసం ఏకంగా జిల్లానే మారుస్తూ చీపురుపల్లి నియోజకవర్గాన్ని గంటాకు చంద్రబాబు ఎంపిక చేశారు. గతంలో విశాఖ పర్యటన సందర్భంగా తనను రాకుండా చేసినప్పటికీ గంటా కిమ్మనకపోవడాన్ని మనసులో పెట్టుకున్న చంద్రబాబు... ఎన్నికల్లో గంటాకు షాక్ ఇచ్చేందుకు ఎప్పటి నుంచో వేచిచూస్తున్నారన్న అభిప్రాయం ఉంది. దీంతో ముందుగానే తమ మీడియాకు చీపురుపల్లికి గంటా అనే లీకులిచ్చింది. అయినప్పటికీ తనకు భీమిలి ఇవ్వాలని గంటా పట్టుబడుతుండగా... కుదరదని ఇప్పటికే చంద్రబాబు తేల్చిచెప్పారు. చివరి ఆశగా మరోసారి చంద్రబాబును గంటా కలిసి భీమిలి ఇవ్వాలంటూ వేడుకున్నట్టు తెలుస్తోంది.

అయితే చీపురుపల్లికి చలో అనాల్సిందేనని చివరాఖరి మాటగా బాబు స్పష్టం చేశారు. దీంతో ఏమీ చేయాలో పాలుపోక ఊసూరోమని గంటా ఉన్నట్టు తెలుస్తోంది. చీపురుపల్లికి వెళ్లి ఓడిపోవాలా? కిమ్మనకుండా పోటీ చేయకుండా గౌరవాన్ని కాపాడుకోవాలా అనే మీమాంసలో పడినట్టు సమాచారం. మొత్తంగా తెలుగుదేశం పార్టీలో రేగిన అసంతృప్తికి చంద్రబాబు ఎటువంటి మందుపూయకపోగా మరింత రెచ్చగొట్టినట్టే వ్యవహారశైలి ఉందన్న అభిప్రాయం ఆ పార్టీ నేతల్లో వ్యక్తమవుతోంది.

అనకాపల్లి... గోవిందా!

అనకాపల్లి నియోజకవర్గంలో చాలా **రోజుల నుంచీ పార్టీ కో**సం పీలా గోవింద్ **పనిచేస్తున్నారు. తన సీ**టుకు వచ్చిన ఇబ్బం**దేమీ లేదన్న ధీమాతో** ఉన్న పీలాకు కోలు**కోలేని దెబ్బ తగిలింది.** తొలి విడత జాబితా**లోనే అనకాపల్లి సీటు** జనసేన నుంచి కొణ**తాల రామకృష్ణకు ప్ర**కటించడంతో పీలాకు **గట్టి షాక్ తగిలినట్లు** అయింది. దీనిపై **ఆయన అనుచరులు పార్టీ** తీరుపై అగ్గిమీద **గుగ్గిలమవుతున్నారు.** పీలాకు ఇవ్వకపోతే ఎవరికీ సహకరించే ప్రసక్తి లేదని తేల్చిచెప్పారు. దీంతో పీలాను చల్లబరించేందుకు చంద్రబాబు కబురుపంపారు. అనకాపల్లి సీటును జనసేనకు ఇచ్చేశామని.. రాబోయే రోజుల్లో మంచి చేస్తామనే ఊరడింపుడు మాటలు చంద్రబాబు మాట్లాడినట్టు తెలుస్తోంది. దీంతో ఏమీ మాట్లాడకుండానే పీలా గోవింద్ వెనుదిరిగినట్టు సమాచారం. ఇదే విషయాన్ని ఆయన అనుచరుల వద్ద చెప్పగా.. తాడోపేడో తేల్చుకోవాల్సిందేనని వారు మాట్లాడినట్టు తెలుస్తోంది. మొత్తంగా అధినేతతో జరిగిన సమావేశం పీలాకు ఎటువంటి ఊరడింపు దక్కకపోగా మరింత రెచ్చగొట్టినట్టు అయ్యిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ఆయన ఏ నిర్ణయం తీసుకుంటారోననే చర్చ సాగుతోంది.

జిల్లాలో 1800 గ్రామాల్లో దోమల మందు పిచికారీకి చర్యలు

- ఏప్రిల్ 15 నుంచి మొదటి విడత కార్యక్రమం ప్రారంభం
- ప్రతీ ఒక్కరు డ్రై డేను పాటించాలి
- జిల్లా మలేరియా అధికారి ప్రసాద్



విద్యార్థితో మాట్లాడి మందులు పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి ప్రసాద్

కొయ్యూరు: జిల్లాలో మొదటి విడత ఐఆర్ఎస్ (దోమల నివారణ మందు) పిచికారీ పనులను ఈ ఏడాది 15 నుంచి చేపడతామని జిల్లా మలేరియా అధికారి(డీఎంవో) పి.ఎస్.ఎస్.ప్రసాద్ వెల్లడించారు. ఈ మేరకు ప్రణాళికను సిద్ధం చేస్తున్నామన్నారు. మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలను ఆయన సోమవారం సందర్శించారు. అక్కడ విద్యార్థులతో మాట్లాడారు. వంటశాల, డార్మిటరీలను పరిశీలించారు. ఉపాధ్యాయుల క్వార్టర్లను పరిశీలించారు. నీటిని నిల్వ చేయవద్దని సూచించారు. వారానికి ఒక రోజు విధిగా డ్రై డేను పాటించాలన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాడేరు డివిజన్‌లో 1350 గ్రామాల్లోను, రంపచోడవరం డివిజన్‌లో 450 గ్రామాల్లోను పిచికారీ పనులు చేయాల్సి ఉందన్నారు. మలేరియా కేసులు గతంతో పోలిస్తే మన్యంలో గణనీయంగా తగ్గాయన్నారు. నీటిని ఎక్కువ కాలం పాటు ఇల్ల ఉంచితే లార్వా వృద్ధి చెంది దోమలు పెరుగుతాయన్నారు. ప్రతీ ఒక్కరు విధిగా నీటిని నిల్వ లేకుండా చేసుకోవాలని సూచించారు. పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అన్ని సచివాలయాల పరిధిలో ఫాగింగ్ చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారికి తెలియజేస్తామన్నారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి నీలకంఠం నాయుడు, ఏఎంవో సత్యనారాయణ, ఏటీడబ్ల్యావో క్రాంతికుమార్, ఎంపీడీవో లాలం సీతయ్య, ప్రిన్సిపాల్ మోహన్, వైద్యుడు సంపత్, పాల్గొన్నారు. చింతపల్లి సీహెచ్‌సీ నుంచి చిన్న పిల్లల వైద్య నిపుణులు ప్రభావతి పాఠశాలను సందర్శించి విద్యార్థులను పరీక్షించి, పలు సూచనలు చేశారు.

భూసార పరిరక్షణపై అవగాహన అవసరం

జిల్లా వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఆషాదేవి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆశాదేవి



గంపరాయిలో రైతు గ్రూపులకు పిండిమిల్లుల యంత్రాలను పంపిణీ చేస్తున్న పీడీ తదితరులు

పెదబయలు: భూసార పరిరక్షణ అందరి బాధ్యత అని జిల్లా వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.ఆషాదేవి అన్నారు.మినిస్ట్రీ ఆఫ్ అగ్రీ అండ్ ఫార్మసీ వెల్ఫేర్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో స్కూల్ సోయల్ హెల్త్ ప్రోగ్రాం అనే కార్యక్రమంలో భాగంగా సోమవారం పెదబయలు ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాల ఆవరణలో ఏకలవ్య పాఠశాల విద్యార్థులకు భూసారం, భూసార పరీక్ష ఉపయోగాలు అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకురాలు ఎం.విజయలక్ష్మి మట్టి నమూనా సేకరణ పద్ధతిని వివరించారు. సేంద్రియ సాగు వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. ప్రకృతి ఎరువులతో భూమి సారవంతంగా మారుతుందున్నారు. సేంద్రియ ఎరువులతో పండించిన పంటలు తినడం వల్ల మంచి ఆరోగ్యంతో పాటు మార్కెట్‌లో ఈ పంటలకు మంచి ధర ఉందన్నారు. విద్యార్థులు తమ గ్రామాల్లో రైతులకు సేంద్రియ సాగు ప్రాధాన్యతను తెలియజేయాలని సూచించారు. మండలంలోని జాతీయ ఆహార భద్రత పథకం ద్వారా చిరు ధాన్యాలు సామూహిక క్షేత్రాలు నిర్వహిస్తున్న గంపరాయి, అడుగులపుట్టు గ్రామ రైతు గ్రూపులకు 50 శాతం రాయితీపై ఆరు పిండి మిల్లుల యంత్రాలను అందజేశారు. ఈ యంత్రాల ద్వారా చిరుధాన్యాలను పిండిగా మార్చి మార్కెటింగ్ ద్వారా స్వయం ఉపాధి పొందవచ్చన్నారు. మండల వ్యవసాయ అధికారి ఏ.శ్రీనివాస్, ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్ పి.కేశవరావు, వ్యవసాయ సహాయకులు అనూష, శైలజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పార్టీ విజయానికి సమష్టి కృషి

వైఎస్సార్‌సీపీ రంపచోడవరం నియోజకవర్గ పరిశీలకులు కర్రి పాపారాయుడు





ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబుని కలిసిన కర్రి పాపారాయుడు

అడ్డతీగల: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి సమిష్టి కృషి చేస్తామని పార్టీ రంపచోడవరం నియోజకవర్గ పరిశీలకులు కర్రి పాపారాయుడు అన్నారు. నియోజకవర్గ పరిశీలకులుగా పునర్నియామకం అయిన నేపథ్యంలో సోమవారం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబును మర్యాదపూర్వకంగా కలిసినట్టు ఆయన చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి పార్టీ శ్రేణులతో కలిసి సైనికుల్లా పనిచేస్తామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచి తిరుగులేని విజయానికి పాటుపడాలని కోరారు. మండలంలోని నిర్వహించిన వైఎస్సార్ వాహన యాత్రలో పాల్గొన్నట్టు చెప్పారు.

రైతులకు అండగా ప్రభుత్వం

- ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి
- జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర



రైతులకు పిండి మిల్లుల యంత్రాలను అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

ముంచంగిపుట్టు: ప్రభుత్వ కల్పిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. మండల కేంద్రంలో సోమవారం 50శాతం రాయితీపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పించి మిల్లుల యంత్రాలను జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర చేతుల మీదుగా రైతులకు పంపిణీ చేశారు. అనంతరం అరకు ఎంపీ మాధవి ఎంపీ లాడ్స్ నిధులతో 365 ఎల్‌ఈడీ లైట్లును సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు.అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో వలంటీర్ల సన్మాన సభను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర మండలంలో 299 మంది గ్రామ వలంటీర్లతో పాటు, సేవ రత్న అవార్డు పొందిన ఐదుగురు వలంటీర్లను సన్మానించారు. అనంతరం మహిళలకు 4వ విడత వైఎస్సార్ ఆసరా చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందన్నారు. అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. రైతుల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గ్రామ వలంటీర్ల వల్ల ప్రజలకు ఇంటివద్దకే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని, ప్రభుత్వ ప్రజా సేవల్లో వలంటీర్ల ముఖ్య భూమిక పోషిస్తున్నారని, వలంటీర్ల వ్యవస్థ వల్ల ప్రజలు గతంలో పడే అవస్థలు తీరాయన్నారు. గ్రామాల్లో ఎంపీ లాడ్స్ ద్వారా ఎల్‌ఈడీ లైట్లు పంచాయతీలకు రావడం చాలా సంతోషించాల్సిన విషయం అన్నారు. ఎంపీపీ సీతమ్మ, వైస్ ఎంపీపీ భాగ్యవతి, ఎంపీడీవో కిరణ్‌కుమార్, ఏవో శ్రీనివాస్‌బాబు, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు, సర్పంచ్ రమేష్, ఎంపీటీసీలు సుబ్బలక్ష్మి, కమల, పార్వతమ్మ, నాయకులు కొండలరావు, జయదేవ్, జగన్నాథం, పద్మారావు, రాంప్రసాద్, తిరుపతి, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్ల, గిరిజన రైతులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు

ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే



అర్జీలు స్వీకరిస్తున్న పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం: స్పందనలో వచ్చిన అర్జీల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అన్నారు. ఐటీడీఏ సమావేశపు హాలులో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. స్పందనకు సుమారుగా 40 అర్జీలు వచ్చాయన్నారు. దారగెడ్డ, గుర్తేడు, పాతకోట పంచాయతీల్లో ఒక్కొక్క పంచాయతీకి 20 మినీ రైస్ మిల్లు మంజూరు చేయాలని పలువురు అర్జీ అందజేశారు. ఉమ్మెత్త గ్రామంలో 20 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని మడికి గంగన్నదొర, శివకృష్ణలు కోరారు. పిడతమామిడి గ్రామంలో సెల్‌టవర్ నిర్మించాలని సర్పంచ్ నేసం మరిడమ్మ, యెజ్జు వెంకటేశ్వరరావు కోరారు. పోక్సుపేటలో 18 ఎకరాల భూమి సమస్య పరిష్కరించాలని పరదా సాయి, రాజన్నదొరలు అర్జీ అందజేశారు. రంపచోడవరం శివాలయంలో శివరాత్రిని మూడు వీధుల వారు కలిసి నిర్వహిస్తామని పీవోకు తెలిపారు. ఏపీవో శ్రీనివాసరావు, డీడీ అబ్షలోం తదితరులు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొట్టిన కారు- ఒకరు మృతి



మృతుడు శ్రీనివాస్(ఫైల్)

ఎటపాక: కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టిన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన సోమవారం తెల్లవారుజామున జరిగింది. ఎటపాక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..తెలంగాణ రాష్ట్రం టేకులపల్లి గ్రామానికి చెందిన జాటోత్ శ్రీనివాస్(23) తన డ్రైవర్‌తో కారులో మారేడుమిల్లి వెళ్లేందుకు ఆదివారం రాత్రి భద్రాచలం వచ్చాడు. అక్కడ నుంచి తెల్లవారుజామును మారేడుమిల్లి వెళ్తుండగా ఎటపాక మండల పరిధిలోని బాసవాగు వద్ద జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో భద్రాచలం తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి.పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెంటాడిన మృత్యువు

- డివైడర్‌ను ఢీకొట్టిన ద్విచక్ర వాహనం
- పురుషోత్తపురం వద్ద ఒడిశా వాసి దుర్మరణం



జగన్నాథం మృతదేహం

యలమంచిలి: సకాలంలో డ్యూటీలో చేరేందుకు వెళ్తున్న ఓ యువ ఇంజినీర్‌ను మృత్యువు వెంటాడింది. ఉపాధి నిమిత్తం ఒడిశాకు చెందిన తరాయి జగన్నాథం (26) తెలంగాణాలో మునగాడకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా సోమవారం ఉదయం యలమంచిలి మండలం పురుషోత్తపురం హైవే జంక్షన్ వద్ద డివైడర్‌ను ఢీకొట్టి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా రంభ గ్రామానికి చెందిన అతడు సివిల్ ఇంజినీర్‌గా మునగాడ వద్ద కేపీసీ కంపెనీలో పని చేస్తున్నాడు. ఇటీవల తన స్వగ్రామం వచ్చి తిరిగి డ్యూటీలో చేరేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఈ ప్రమాదానికి గురైనట్టు యలమంచిలి రూరల్ ఎస్సై పి.సింహాచలం తెలిపారు. మృతదేహాన్ని యలమంచిలి మార్చురీలో భద్రపరిచామని, మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామన్నారు.

దృఢ సంకల్పంతో విధులు నిర్వర్తించాలి

- అనకాపల్లి ఎస్పీ కె.వి మురళీకృష్ణ



ఏఆర్ పోలీస్ మైదానంలో డాగ్ స్క్వాడ్ శిక్షకుడికి సర్టిఫికెట్ అందజేస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

ఆరిలోవ: రానున్న ఎన్నికల్లో పోలీసులు దృఢ సంకల్పంతో విధులు నిర్వర్తించాలని అనకాపల్లి ఎస్పీ కె.వి మురళీకృష్ణ తెలిపారు. విశాలాక్షినగర్ ఏఆర్ పోలీస్ మైదానంలో సోమవారం జరిగిన మొబలైజేషన్ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు కవాతుతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వృత్తిపరమైన, వ్యక్తిగత క్రమశిక్షణతో పోలీసులు విధులు నిర్వహించాలన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి పోలీసులు కృషి చేయాలన్నారు. చెక్ పోస్టుల వద్ద పటిష్టమైన బందోబస్తు నిర్వహించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఇటీవల విజయవాడలో జరిగిన 32వ ఆర్సీ కోర్సులో మత్తు పదార్థాలను గుర్తించడంలో మొదటి బహుమతి పొందిన అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీస్ విభాగానికి చెందిన రాకీ (జాగిలం), పేలుడు పదార్థాలను గుర్తించి రెండో స్థానంలో నిలిచిన అనకాపల్లి జిల్లాకు చెందిన వోల్గా (జాగిలం) శిక్షకులను అభినందించారు. అదనపు ఎస్పీలు బి.విజయభాస్కర్, పి.సత్యనారాయణ, వి.సత్తిబాబు, డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఆర్‌ఐలు సతీష్, అరవింద్, కిశోర్, వెంకటరావు, మన్మథరావు పాల్గొన్నారు.

నేడు అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్ (విశాఖ): బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు.